క్లుప్తంగా

దయనీయంగా రామచంద్రుడు కాలువ



రామచంద్రుడు కాలువలో పడవేసిన వ్యర్థాలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణ పరిధిలోని రామచంద్రుడు పంట కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో సాగునీటి సమస్య తలెత్తింది. పట్టణంలోని 30వ వార్డు సంఘం కాలనీ నుంచి బైపాస్ రోడ్డు, గాంధీ నగర్, సైధిల్ పేట, ఏడిద రోడ్డు, రావులపేటల, గొల్లపుంత కాలువ వరకూ కాలువ విస్తరించి ఉంది. సమీప ప్రాంతాల ఆయకట్టుకు ఈ కాలువే ప్రధాన ఆధారం. పట్టణంలోని పలు వీధుల్లోని చెత్త కాలువలోకి చేరుకుంటుండటంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుంది. నివాసితులు వ్యర్థాలను కాలువలో జార విడుస్తుండటంతో సమస్య తీవ్రమవుతుంది. వెంటనే మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే దళితుల అభ్యున్నతి

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని దళితుల అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని పార్టీ ఆర్టీఐ నియోజకవర్గ కన్వీనర్, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో దళితుల అభ్యున్నతి కూటమి పాలనలోనే సాగుతుందంటూ కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. మండపేట నడిబొడ్డున ప్రధాన రహదారిలో దళితనేతల విగ్రహాలను నెలకొల్పిన చరిత్ర తమ నాయకుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకే దక్కుతుందన్నారు. విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పడం ద్వారా తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల ఆత్మగౌరవాన్ని చాటారన్నారు. దళితుల రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రగతికి వైఎస్సార్ సీపీ పాటుపడిందని ఆయన పేర్కొన్నారు.

రైతులకు డ్రోన్ల అందజేత

రామచంద్రపురం రూరల్: రైతులు మారుతున్న కాలంతో పాటుగా పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ద్రాక్షారామలో ఆదివారం రామచంద్రపురం, కె.గంగవరం మండల రైతుల్లో 7 గ్రూపులకు రూ.68.60 లక్షల విలువైన 7 డ్రోన్లను మంత్రి అందజేశారు.

ఆకట్టుకుంటున్న ప్రవచనాలు



భీమేశ్వరాలయ ప్రాంగణంలో ప్రవచనాలు చెబుతున్న దేవులపల్లి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరిజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మి గణపతి కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని వేగాయమ్మపేటకు చెందిన సంస్కృత పండితులు దేవులపల్లి శ్రీకొండిన్య గణపతి తత్వంపై చెబుతున్న ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 28న ప్రారంభమైన ప్రవచనాలు తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి ఎనిమిది గంటల వరకు భక్తులను అలరిస్తున్నాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జుత్తిక చిన్నా, ద్రాక్షారామతోపాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

మామిడికుదురు: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా జరుగుతుందని దీప్తి విద్యాసంస్థల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఔత్సాహికులు తమ బయోడేటాతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డీఎస్‌డీఓ హరిశేషు ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మామిడికుదురు: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల బీఈడీ స్టూడెంట్స్, ఆక్సిజన్ అసోసియేషన్ సంయుక్తంగా పాశర్లపూడిలో ఆదివారం ఫీల్డ్ వర్క్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్వచ్ఛభారత్‌తో పాటు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. స్థానికులకు ఉచితంగా చెత్త బుట్టలు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రేమజ్యోతి, ఎస్‌కేబీఆర్ కళాశాల బీఈడీ ప్రిన్సిపాల్ అంజనీ శ్రీనివాస్, ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కటికిరెడ్డి గంగాధరం, నాగరాజు పాల్గొన్నారు.

ఏటికి ఎదురీత..!

- ప్రకృతికి దగ్గరగా లంకవాసుల జీవనం
- వానొచ్చినా, వరదొచ్చినా బెదరరు
- షెల్టర్ ఏర్పాట్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం

కపిలేశ్వరపురం: వారిది ప్రకృతికి అత్యంత సమీపంలో ఆహ్లాదంగా గడిపే జీవితం. గౌతమి గోదావరి నది నీరు తీపి, లంక మట్టి వాసన, ఉద్యాన పంటల ఆహ్లాదం, తమను కాపాడుతున్నారన్న అమ్మవార్లకు పూజలతో వారి జీవనం ముడిపడి ఉంటుంది. తెల్లవారుజామునే నిద్రలేవడం, పశువుల సంరక్షణ సామాగ్రిని సైకిలుకు తగిలించుకుని వ్యవసాయ క్షేత్రాలకు తరలిపోవడటం, పశువులను సాకిన అనంతరం పాలు, వంట చెరుకుతో ఇంటికి రావడం. ఇంటిల్లపాదీ అల్పాహారం తినడం, ఉద్యాన పంటల సాగుకు ఉపక్రమించడంతో వారి రోజువారీ జీవితం కొనసాగుతుంది. వాటికి తోడు ప్రకృతి శక్తులతో పోరాడటం లంక గ్రామాల ప్రజల ప్రత్యేకత. వరద వచ్చిందంటే వారి జీవితం ఓ సాహసోపేతం. లంక గ్రామాల జీవన స్థితి గతులు నేపథ్యంలో ఈ కథనం.

భౌగోళిక పరిస్థితులిలా..

కపిలేశ్వరపురం మండలంలోని ఐదు లంక గ్రామాలు దాదాపు గోదావరిలో ఉన్నాయి. మండల కేంద్రమైన కపిలేశ్వరపునానికి భౌగోళికంగా ఏమాత్రం సంబంధంలేని దూరంలో ఉన్నాయి. మండల కేంద్రమైన కపిలేశ్వరపురానికి అద్దంకివారిలంక గ్రామం సుమారు 45 కిలోమీటర్లు దూరంలో ఉంది. కేదారిలంక 25 కిలోమీటర్లు దూరంలో ఉంది. వాటితో పాటు మరో మూడు శివారు గ్రామాలకు వెళ్లాలంటే జొన్నాడ-రావులపాలెం గోదావరి బ్రిడ్జిని దాటుకుని వెళ్లాల్సిందే. కేదారిలంక గ్రామం మరో మండల కేంద్రమైన కొత్తపేటకు కూతవేటు దూరంలో ఉంది. అద్దంకివారిలంక గ్రామం మరో మండల కేంద్రం అయినవిల్లికి 9 కిలోమీటర్లు దూరంలో ఉంది.

జీవన విధానం

ఇంటిల్లపాదీ లంక సాగుపనిలో ఉంటారు. కిలోమీటర్లు మేర కాలినడకన నడుస్తూ పొలాలకు వెళ్తారు. భోజనానికి సకాలంలో తిరిగిరావడం సాధ్యంకాక ముంతలు తీసుకెళ్లి సాయంత్రం వేళ తిరుగుప్రయాణం చేస్తుంటారు. పశువుల సంరక్షణ కోసం ఒక్కోసారి పొలంలోనే ఉండిపోవడం లంక వాసుల ధైర్యానికి ప్రతీక. వరద పరిస్థితులకు వీరు ప్రతిసవాల్ విసురుతుంటారు. గ్రామాలు ముంపుబారిన పడినా ఇంటి చుట్టూ నీరు చేరినా గ్రామం విడిచి వెళ్లేందుకు వీరికి మనస్కరించదు. నీరు విడిచాకా గ్రామాన్ని, ఇళ్లను పరిశుభ్రం చేసుకోవడం వీరి ఓపికకు నిదర్శనం. ఇళ్లల్లో నాటుకోళ్లను, పాడిపశువులను పెంచుకోవడం, సహజసిద్ధ పండ్లు, కూరగాయలను సాగుచేస్తుండటంతో విషరహిత ఆహారాన్ని తీసుకోగలుగుతున్నారు.

ఆధునిక యుగానికి దూరంగా

ఏటా ఎదురయ్యే వరద పరిస్థితులు లంక ప్రజలకు పెనుసవాల్‌గా ఉంటుంది. గోదావరి ఉధృతి ప్రభావం ఆరంభమైందంటే తొలిసారిగా పల్లపులంకను వరదనీరు తాకుతుంది.

పల్లపులంకను చుట్టుముట్టక ముందే వ్యవసాయ క్షేత్రాల్లోని పశువులను నివాస ప్రాంతాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుంటారు. వరద గ్రామాలకు చేరుకుంటుందనేలోపు నివాస ప్రాంతంలోని ఆరుబయట సామాగ్రిని ఇళ్లలోకి మార్చుకోవడం, పది రోజులకు సరిపడా సరుకులను ముందస్తుగా భద్రపర్చుకోవడం తదితర చర్యలతో వరదలను ఎదుర్కోవడం ఏటా అలవాటుపడిన పని. ఎటు చూసినా ఆధునిక పద్ధతులు కంటపడే ఈ రోజుల్లో లంక గ్రామాల ప్రజల జీవన విధానాన్ని పరికిస్తే పాతకాలం నాటి రోజులు గుర్తురాక తప్పవు.

పాలనాపరమైన ఇబ్బందులు..

రెవెన్యూ, ప్రభుత్వ పథకాల అమలు కోసం కపిలేశ్వరపురం మండలం, భూముల రిజిస్ట్రేషన్, కోర్టు సమస్యల పరిష్కారం కోసం ఆలమూరు మండలం, వరదల సమయాల్లో పునరావాసం కోసం అయినవిల్లి, కొత్తపేట మండలాలకు వెళ్లాల్సిన దుస్థితి లంక గ్రామాల ప్రజలది. అద్దంకివారిలంక నుంచి కపిలేశ్వరపురంలోని తహసీల్దారు, ఎంపీడీవో, ఎఈవో, ఐసీడీఎస్ కార్యాలయాలకు రావాలంటే అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు మండలాలకు చెందిన గ్రామాల మీదుగా సుమారు 45 కిలోమీటర్లు ప్రయాణించి కపిలేశ్వరపురానికి రావాల్సి ఉంది. శాంతి భద్రతల సమస్య తలెత్తితే అంగర పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాల్సిందే. లంక గ్రామాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, పరిపాలనా పరమైన సమస్యలు పరిష్కారానికి కపిలేశ్వరపురం రావాల్సిందే. తమ గ్రామాన్ని కొత్తపేట మండలంలో విలీనం చేయాలని ఈ నెల 25న గ్రామస్తులు తీర్మాణం చేసి అధికారులను కోరారు.

ఆధ్యాత్మికతకు ఆలంబన..

లంక ప్రజలు నిత్యం ప్రకృతి శక్తులతో మమేకమై ఉండటంతో వాటిని ఆరాధించే క్రమంలో అమ్మవార్లను అమితంగా ఆరాధిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను తూచ తప్పకుండా చేపడతారు. జిల్లాలోనే పర్యాటక కేంద్రమైన ధనమ్మమర్రి కేదారిలంకలోనే ఉంది. ఇతర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల నిర్వహణ, ఆరాధన సంప్రదాయబద్ధంగా కొనసాగుతుంది.



వరదనీటికి నారాయణలంకలో మునిగిన తాటాకిళ్లు (ఫైల్)

గ్రామం:	అద్దంకివారిలంక
జనాభా:	పురుషులు: 1,448
	స్త్రీలు: 1,419
	మొత్తం: 2,867
ప్రధాన పంటలు:	ఉద్యాన సాగు
మండల కేంద్రానికి దూరం:	45 కిలోమీటర్లు
గ్రామం:	కేదారిలంక
మండలం:	కపిలేశ్వరపురం
జనాభా:	పురుషులు: 1,981
	స్త్రీలు: 1,920
	మొత్తం: 3,901
ప్రధాన పంటలు:	ఉద్యాన సాగు
మండల కేంద్రానికి దూరం:	25 కిలోమీటర్లు



వరదలో చిక్కకుండా అద్దంకివారిలంకలో ఎత్తుగా నిర్మించిన దాబా



కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీటిలోనే రాకపోకలు (ఫైల్)



వరద ముంపులో ఇటుక బట్టీ కార్మికుల నివాసాలు

సహజమైన జీవనాన్ని గడుపుతున్నాం



గోదావరి నీరు, పొలం గట్లు ఇవన్నీ ఇబ్బందులతో కూడినవే అయినప్పటికీ అవన్నీ సహజసిద్ధమైనవి. చిన్ననాటి నుంచీ వాటి మధ్య బతుకుతున్నందుకు చాలా ఆనందంగా ఉంటుంది.

వీధి వెంకటరెడ్డి, సర్పంచ్, కేదారిలంక

ముందస్తు జాగ్రత్తలకు అలవాటుపడ్డాం



వరదొస్తే ఏం చేయాలన్న విషయంలో ముందస్తుగా జాగ్రత్తలు పడుతుంటాం. దీంతో అప్రమత్తంగా ఉండటం అలవాటు పడింది. మారుమూల ఉంటున్నామే కానీ కష్టం విలువ తెలిసి బతుకుతున్నాం.

కొండేటి వెంకటేశ్వరరావు, రైతు, అద్దంకివారిలంక

విద్యాగణపతికి పూజలు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని తరవాణి పేటలో నెలకొల్పిన శ్రీవరసిద్ధి వినాయక నవరాత్ర శిబిరంలో ఆదివారం విద్యా గణపతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పాల్గొని స్వామికి పూజలు చేపట్టారు. అనంతరం చిన్నారులకు పెన్ను, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు వర ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పెన్నులు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



పాఠశాల ఆవరణలో గురువులతో పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: మండలంలోని కుందూరు ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయకంగా కలుసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. పాఠశాలకు చెందిన 2005-06 బ్యాచ్ విద్యార్థులు ఉపాధ్యాయులతో నిర్వహించిన సమ్మేళనం ఘనంగా జరిగింది. తొలుత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులను శాలువాలు, పూలదండలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. సుమారు 28 ఏళ్ల తరువాత వివిధ ప్రాంతాల్లో ఉంటున్న స్నేహితులంతా కలుసుకొని గడిచిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. విద్యాను అందించిన పాఠశాలకు రూ.50 వేలతో ఆర్‌ఓ ప్లాంట్‌ను అందించారు.

విశ్వ సాహితీ కళావేదిక అధ్యక్షుడిగా ఎన్నిక

కపిలేశ్వరపురం (మండపేట): విశ్వ సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా నక్కిన వీర రాఘవ రావు నియమితులయ్యారు. ఈ మేరకు వేదిక చైర్‌పర్సన్ కె.రమావతి నుంచి తనకు ఉత్తర్వులు అందినట్టు రాఘవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండపేట పట్టణానికి చెందిన రాఘవరావు తెలుగు పండితుడుగానూ, సాహితీవేత్తగాను విశేష సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పండితులు, సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

సామూహిక సరస్వతీ పూజ

రాయవరం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. బొజ్జ గణపయ్యలకు అంగరంగ వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించిన భక్తులు..బై బై గణేశా అంటూ సాగనంపుతున్నారు. నవరాత్రుల్లో భాగంగా ఐదవ రోజు ఆదివారం రాయవరం శ్రీనివాసం కాలనీలో ఏకదంతుడి నిమజ్జనోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. గణనాథుడుని గణపతి బొప్పా మోరియా..అంటూ భక్తులు నిమజ్జన కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. ఉత్సవ కమిటీ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని గంగమ్మ ఒడిలో నిమజ్జనాన్ని అంతే ఘనంగా చేపట్టారు. గణనాథుడికి ఉద్వాసన పలికిన అనంతరం విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా యువకులు, మహిళలు సంప్రదాయ నృత్యాలతో చేస్తూ..రంగులు చల్లుకుంటూ.. బాణాసంచా కాలుస్తూ స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. రాయవరం గ్రామం రజకుల రామాలయం కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనాన్ని వైభవంగా చేపట్టారు. చిన్నారులంతా కలిసి నిమజ్జనానికి తరలివెళ్లారు.



కూళ్లలో సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు

చిన్నారులకు పెన్నుల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని కూళ్లలో మెయిన్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపంలో ఆదివారం సరస్వతీ పూజ నిర్వహించారు. వేదపండితులు గ్రామంలోని చిన్నారులతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పూజ అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.



జగన్నాథగిరిలో నిమజ్జన ప్రాంతాలు పరిశీలిస్తున్న ఎస్సై, రెవెన్యూ సిబ్బంది



బొజ్జ గణపయ్యను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న చిన్నారులు

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

కాజులూరు: వినాయక నిమజ్జనంలో భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలని గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎస్సై, రెవెన్యూ సిబ్బంది మండల గ్రామాల్లో పర్యటించి వినాయక మండపాలు, నిమజ్జనం నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. జగన్నాథగిరిలో ఆయన మాట్లాడుతూ, నిమజ్జనం, ఊరేగింపు సమయాల్లో విద్యుత్ తీగలు విగ్రహాలకు తగలకుండా జాగ్రత్త పడాలన్నారు. అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాల నిమజ్జనం చేసుకోవాలన్నారు. వీఆర్వో ఈశ్వరరావు, స్టేషన్ సిబ్బంది, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లంకల్లో జలజడి



అప్పనపల్లిలో గరుత్మంతుని విగ్రహం వద్ద వరద ఉధృతి



ఎదురుబిడెం కాజ్‌వే వద్ద పడవలపై దాటుతున్న లంక ప్రజలు

- పొంగి ప్రవహిస్తోన్న నదీపాయలు
- కాజ్‌వేపై పడవ ప్రయాణాలు
- రాకపోకలకు ఇబ్బందులు

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని వశిష్ట, వైనతేయి, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో మూడోసారి వరదలు రావడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసరాలు, తాగునీరు కోసం పడవలు దాటి లంక ప్రజలు బయటకు వస్తున్నారు. వరదలతో లంక గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో అక్కడ పడవలు ఏర్పాటు చేశారు. లంకల నుంచి ఏటిగట్లపైకి తరలించిన పశువులకు మేత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్.గన్నవరం, శివాయలంక, కనకాయలంక గ్రామాల్లో ప్రత్యేక అధికారి జయచంద్ర గాంధీ పర్యటించి స్థానిక అధికారులకు పలు సూచనలిచ్చారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై వరద నీరు ఉధృతిగా ప్రవహించడంతో పూర్తిగా మునిగింది. ఆదివారం లంక ప్రజలు రాకపోకల కోసం పడవలను అధికారులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. కాజ్‌వే వద్ద రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది ఎప్పటికప్పుడు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురు లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో అరటి, మొక్కజొన్న, తమలపాకు, కోకో, కూరగాయ పంటలు నీటమునిగాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని లంక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధికారుల చర్యలు

కనకాయలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని తహసీల్దార్ విద్యాపతి, ఎస్సై హరికోటిశాస్త్రి సమీక్షించారు. కాజ్‌వే వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు. రెండు పడవలను ఏర్పాటు చేసి లంక గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఆర్‌ఐ రాయుడు, వీఆర్వోలు వారి వెంట ఉన్నారు.

మునిగిన ఇళ్లు, కొబ్బరి తోటలు

అంబాజీపేట: ఎగువ ప్రాంతాల్లో వరద పోటెత్తడంతో వైనతేయి గోదావరి శనివారం ఉధృతంగా ప్రహించి గ్రామాల్లో ఉండే కౌశికలు ఉరకలు వేస్తున్నాయి. నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో ఇళ్లు, కొబ్బరి, అరటి, దొండ పాదులు నీట మునిగాయి. గోదావరి సమీపంలో ఉన్న కౌశికలోకి వరద నీరు చేరడంతో కాలనీలు, అరటి, కొబ్బరితోటను ముంచెత్తుతున్నాయి. నందంపూడి బొంతువారి పేటలో ఆరు ఇళ్లు నీట మునిగాయి. తొండవరం రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో స్థానికుల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అయినవిల్లిలంకలో కాజ్‌వే వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్

ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలి

పి.గన్నవరం మండలంలోని మానేపల్లి శివారు శివాయలంకకు వెళ్లే రహదారి రెండు కిలోమీటర్ల మేర వరదనీటతో మునిగిపోయింది. దీంతో ఆ గ్రామ ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి ఏటిగట్టు నుంచి గతంలో మాదిరిగా ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాజ్‌వేను ముంచెత్తిన వరద

మామిడికుదురు: గోదావరి వరద అంతకంతకు ప్రమాదకరంగా మారుతోంది. ఈ నెలలో రెండోసారి అప్పనపల్లి కాజ్‌వే ముంపు బారిన పడింది. ఆదివారం దీనిపై మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు వరద నీటిలో అష్టకష్టాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ వరద మరింత పెరిగిన పక్షంలో రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. అప్పనపల్లి స్నానఘట్టం వద్ద అమృత లింగేశ్వరస్వామి విగ్రహం పూర్తిగా నీట మునిగింది. గరుత్మంతుని విగ్రహం వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది. వరద ఉధృతితో పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాల్లోని పసుగ్రాసం, కూరగాయల తోటలు ముంపు బారిన పడ్డాయి. వరద మరింత పెరుగుతుందన్న జలవనరుల శాఖ హెచ్చరికలు తీర గ్రామాల ప్రజల్ని తీవ్రంగా కలవర పెడుతున్నాయి. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం



సుందరం దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేట మహాలక్ష్మమ్మ హిందూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వడ్లమాని సోమ సుందరం పదవీ విరమణ సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అబంటి భవాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, మాస్టారు పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. ఆరోగ్యం సహకరించపోయినా చిత్తశుద్ధితో పాఠశాలను ఉన్నత స్థానంలో నిలపడానికి నిరంతరం కృషి చేశారన్నారు. పదవీ విరమణ సందర్భంగా ఆ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి తుకారం, ఎంఈఓలు తాడి వీరరాఘవ రెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, పీఆర్‌టీయూ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆని శ్రీనివాస్, పెద్దలు పితాని వీరభద్రం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల ఆరాధ్య దైవం బలరాముడు

అంబాజీపేట: వ్యవసాయ రంగంలో రైతులందరికి ఆరాధ్య దైవం బలరాముడేనని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో కోదండ రామాలయం వద్ద బలరామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అడపా చిన బాబు దంపతులు హలపూజ, గోపూజ, బలరామ పూజలు నిర్వహించారు. ఉపసర్పంచ్ బందన రాంబాబు, ఉప్పుగంటి భాస్కరరావు పాల్గొన్నారు.